

# కుక్కపిల్ల

సౌమ్య హైస్కూల్ వదలక ముందే, సూటర్సూ, వారిలో వారే రైవల్సూ తయారైనారు. యెందుకని ఆకర్షిస్తున్నదంటే, అండ దండ లేదు, కలవారి బిడ్డ గాదు, నవ్వుతూ ఫ్రెండ్లీగా వుంటుంది. రాంక్ తెచ్చుకుంటుంది. వుండుండి ఫస్టు వస్తుంది. పుస్తకాలరువు యిస్తుంది.

వెంటబడే వాళ్లెక్కువైనారు. టెక్నికల్ పరీక్షలు పాసైంది. ప్రైవేట్ స్కూల్స్‌లో పరభాషలు నేర్చింది. దుబాసిగా వెళ్లచ్చు, ట్రాన్స్‌లేట్ చేసే పనితెచ్చుకోవచ్చు, టైపిస్ట్, స్టెనో, క్లర్క్, రిసెప్షనిస్ట్, ఆ చిన్న వుద్యోగాలు సౌమ్య దృష్టిలో వున్నాయి. తనను తాను సపోర్ట్ చేసుకోవాలని ఆశయం.

యెందుకు పెళ్లాడదూ? అడుగుతున్నాముగా? అనుకుని, ఫ్రీలవ్ యిష్టంగాబోలని అపోహపడ్డారు సూటర్సు.

పాళీ భాషనేర్చి లిపి నేర్చి, బౌద్ధ జాతక కథలు చదివింది సౌమ్య. వింతగా తోచాయి.

ఒక గొప్ప పట్టుదలగల స్త్రీకి ఒడిస్సీ నృత్యం నేర్చుకోవాలనే బలీయమైన కోరిక గలిగిందట. కలగటమేమిటి మంచి గురువునాశ్రయించి, చెప్పినట్టు నడుచుకుంటానని వాగ్దానం చేసి పట్టుదలగా శ్రద్ధగా నేర్చింది. ప్రోగ్రాములిచ్చీ, టూర్ చేసీ, విదేశాలలో ప్రదర్శనలిచ్చీ ధనికురాలైంది.

బౌద్ధవాఙ్మయం చదువుతుంటే సౌమ్యకి పరకాయ ప్రవేశం అనే విద్య నేర్వాలని కోరిక గలిగింది. అది అందరికీ రాదు. కానీ, నశించకుండా, సిద్ధుల వద్ద వుండిపోయింది. సిద్ధులు బైరాగులల్లే తిరగరు. గుహలో వుంటారు. విద్యను కాపాడటమే వారి ధ్యేయం. పూర్వకాలం మనకు సిద్ధపురుషులే

అక్షరాభ్యాసం చేసేవారు. జైనం, బౌద్ధం పక్కపక్కగా నడుస్తూనే వున్నాయి అప్పుడు.

సిద్ధుడే, ఓనమః శివాయః సిద్ధం నమః అని దిద్దబెట్టేవాడు. గుంట ఓనమాలంటే, పిల్లలు కూచుని వుంటారు. వారి ముందు పళ్లెంలో యిసకపోసి ఓం దాని కింద రెండక్షరాలు నమః, దాని కింద శివాయః, దాని కింద సిద్ధః నమః అని వ్రాసి చూపుడువేలుతో అక్షరాలమీద దిద్దటం చూపేవారు. తర్వాత పలకలు వచ్చాయి. నేటికీ ఓనమః అనే అక్షరాభ్యాసం చేయించటం అలవాటు. ఆచారమూనూ.

కనక సిద్ధులు వుండివుండాలి. వెతకాలి. ఈ నాటికీ బౌద్ధమూ వున్నది. జైనమూ వున్నది. ఇలా తర్కించుకుని సిద్ధుని వెతకాలనీ, ఆ విద్య నేర్వాలనీ బయలుదేరింది సౌమ్య.

దేవుడున్నప్పుడు, సిద్ధుడూ వుండాలి. కళ నశించదు. రిసెర్చి చేసి మళ్లా పైకి తెచ్చేవారుంటారు. 'కనుగొంటినీ శ్రీరామునీ నేడు' అని త్యాగరాజస్వామి, తన పూజా విగ్రహాలు సీతారామలక్ష్మణులవి కనబడగానే పాడాడుట. వేసారకుండా అలా సౌమ్య సిద్ధుని కోసం వెతికింది.

2

సిద్ధుడు వాత్సల్యంతో చూశాడు సౌమ్యను. దయతో నవ్వాడు. జాలిపడ్డాడు. విద్యగరపదగిన అమ్మాయే అని గుర్తించాడు. కానీ, పరీక్షించాలి. వివరాలు వినాలి అనుకున్నాడు.

'' ఇప్పుడా విద్య నెవరూ గౌరవించటం లేదు తల్లీ. రాజాదరణా రాదు. లాంగ్వేజెస్ నేర్పటం ఆపేసి, కంప్యూటర్ కోర్సుకు హాజరౌతున్నారిప్పుడు దానిని

ప్రదర్శించి డబ్బు గుణించలేవు. దానిని నేర్చియేమి చేయాలనుకుంటున్నావు? ఇంకా చాలా విద్యలున్నాయి. ఇప్పటికే చాలా నేర్చావు నువ్వు. వాటి మీద అర్జించు'' అని ఆమెను ఆపాలని చూశాడు సిద్ధుడు.

'' అర్జన కోసం, ప్రదర్శనలివ్వాలనిగాదు మౌనీ! నా అవసరానికి వాడుకోవాలని అడుగుతున్నాను. ఒక్కొక్కప్పుడు గెలవలేక, కనబడకుండా పారిపోవాలనిపిస్తుంది. మరొకప్పుడు కోరికలాపుకోలేక, పక్షినై ఆకాశంలో విహరించాలనిపిస్తుంది. భూమి మీదున్నవారంతా మానవులేనా? గోవులాగా కనిపించేవాడు వ్యాఘ్ర స్వభావం బైటబెడతాడు. చిలకలాగా కనిపించే స్త్రీ రాబందు స్వభావం కలిగివుంటుంది. పూర్ణచంద్రునిలాగా అహ్లాదకరంగా వుండే వ్యక్తి నక్కలాగా ప్రవర్తిస్తాడు. ప్రేమ చావదు. మోహం నశించదు. అదీ యిబ్బంది'' అని తలవంచుకున్నది సౌమ్య. మళ్లా తలెత్తింది.

నవ్వు మొహంతో నిశ్చలంగా చూస్తున్నాడు సిద్ధుడు. ''చాలా శ్రమపడి నా గుహ కనుగొన్నావు సౌమ్యా! నమ్మకం, పట్టుదల ఆత్మస్థైర్యం కావాలా విద్యకు. అవేగాక నేర్పుగూడా కావాలి. ఒక పెద్దమనిషి నా వద్ద ఒక విద్య నేర్చాడు. దాని పేరు లఘుమా. అది మళ్లా రెండు భాగాలు. శరీరాన్ని చిన్నదిగా మార్చటం. అది మారుతి సీతాదేవిని కనుగొన్నప్పుడు చిన్న కోతిపిల్లలాగా మారి ఆకులచాటున కూచుని చూడటానికి వుపయోగించినది. రెండోది శరీరాన్ని బెండులాగా చేసి వూపిరిబిగబట్టి నీళ్లమీద నడవగలగటం, ఆకాశగమనం వంటివి చేయగలగటం. పద్మాసనం వేసి కూచుని పైకిలేవగలగటం. నేర్వటమేమో భక్తిశ్రద్ధలతోనే నేర్చాడు సౌమ్యా! ధనార్జన చేయాలనే కోరికకు లొంగిపోయాడు. తథాగతుడూ, జినుడు గూడా కోరికలుండరాదని భోధించారు. ముఖ్యంగా భోధిసత్త్వుడు దుఃఖానికి కారణం కోరికేనని భోధివృక్షం కింద కూచుని వున్నప్పుడు తెలుసుకున్నాడు. దయ అనేది కలిగివుంటే అదే మన కన్నీ యిస్తుంది. కోరిక అనేది మనిషి

నాడిస్తుంది. విద్యవిద్యకోసమే అనుకోరు. అలా నమ్మినవారికి విద్యే ధనం తెచ్చియిస్తుంది. అదీ నమ్మరు. ఆ పెద్దమనిషి టికెట్ పెట్టి ప్రదర్శన యివ్వాలని అంతా సిద్ధం చేశాడు. కాని సమయానికి ఎక్సైటై పోయాడు. ''చాలామంది వచ్చారే! ఇంతమంది వస్తారనుకోలేదు'' అని పుబ్బిపోయి, శరీరాన్ని బెండులాగా మార్చటం మరిచిపోయాడు. పెద్దతొట్టి అంచున నిలబడినవాడు నీళ్లమీద అడుగుంచబోయి నీళ్లలో పడి మునిగిపోయాడు. చూడటానికి వచ్చినవారిలో యీతగాళ్లున్నారు. వాళ్లు జాలిపడి నీళ్లలో దూకి, మునిగి, వెతికి, మనిషిని పైకి తెచ్చారు. ప్రథమ చికిత్స చేసి బతికించారు సౌమ్యా! అలాగే మరొకసారి పైకి లేవలేక దండం పాతి దాని ఆధారంతో కొద్దిగా పైకి లేవగలిగాడు. ప్రేక్షకులది చూసి దండం తీసేశారు. లేవలేకపోయాడు పెద్దమనిషి. వాడిని మోసుకెళ్లి తమ డబ్బు వాపసు చేయమని బాది తమ డబ్బు లాక్కున్నారు ప్రేక్షకులు. ఒకడిదంతా నాతో నవ్వుతూ చెపితే నాకు చాలా విచారం వేసింది. విద్యను అవమానించాడే అని. యింకెవరికీ యేమీ నేర్పద్దు అనుకున్నాను'' నిరుత్సాహపరచాలని చూశాడు.

''కాని సిద్ధపురుషా! విద్య నశించదూ, నేను ఆత్మరక్షణకే నేరుస్తున్నాను. ఆర్జనకుగాదు. ప్రదర్శననివ్వాలని గాదు. ప్రమాణం చేస్తాను. దేని మీద ప్రమాణం చేస్తే మీరు నమ్ముతారు మునీ!'' అని సాష్టాంగ పడింది సౌమ్య.

''లే. లే. పిచ్చిదానా! తథాగతుని తలచి, జినుని తలచి ప్రమాణం చేయి చాలు. కాని షరతులున్నాయి'' అన్నాడు నిదానంగా.

లేచి కూచున్నది సౌమ్య. ''యేమిటా షరతులు మునీ?'' అనడిగింది. అన్నిటికీ వొప్పుదలే అని తలాడిస్తున్నట్టు కనబడింది మునికి. నవ్వాడు.

''నేర్చిన విద్యను పరీక్షించటానికి వాడరాదు. రెండోది అవసరానికే

వుపయోగించుకోవాలి. మూడు మరొకరడిగితే చూపరాదు. నాలుగు నిన్ను నీవు కాపాడుకునేందుకే వాడుకోవాలి'' అన్నాడు.

విద్య నేర్పుతానన్నట్టే అర్థమైంది సౌమ్యకి. అప్పుడే పక్షి అయి ఆకాశంలోకి యెగురుతున్నట్టు అనుభూతి కలిగింది. సంతోషం వల్ల కన్నీళ్లు రాలినై.

సిద్ధుడింకా చెప్పాడు. ''బైజూ బావరా అనే అబ్బాయికి, వాడు తనను ఆశ్రయిస్తే ఒక గొప్ప సంగీత విద్వాంసుడు, సంగీత విద్య పరిపూర్ణంగా నేర్పాడు. కాని పంపివేసేప్పుడు, ''నాయనా బైజు! నీ కళ్లలో యేదో తీవ్రత కనబడుతూ వచ్చింది. పగతీర్చుకోటానికి సంగీతవిద్యను వాడకు.'' అని చెప్పి మాటతీసుకుని పంపాడు గురువు. త్యాగరాజస్వామి గూడా తాదాత్మ్యం పొందటానికే నేర్చాడు. రాజగౌరవం తలచలేదు. పోటీకి సిద్ధంగా లేడు. యెవరినీ ఓడించలేదు. విద్యను అమ్మలేదు. ధనవంతులడిగితే, 'నా పాట వినాలనుకుంటే దేవాలయంలో కూచుని పాడతాను. అక్కడ వింటే యింకా ఆనందమిస్తుంది భగవంతుని సన్నిధిలో' అన్నాడట. తుకారామ్ గూడా అంతే సౌమ్యా! నాద బ్రహ్మ అని త్యాగరాజస్వామి వినుతికెక్కాడు. సంత్ తుకారామ్ అని అభంగ కర్తపేరుమోశాడు.''

''అలాగే సిద్ధపురుషా! అన్నీ గుర్తుపెట్టుకుంటాను'' అని దణ్ణం పెట్టింది సౌమ్య.

''బాగానే వున్నది సౌమ్యా. నీకు పరకాయ ప్రవేశం చేయాలని వున్నప్పుడు చచ్చిన జీవునితో అవసరం వుండదు. నువే మారిపోగలవు. అదీ నేను నీకిచ్చే ఆశీర్వచనం. లే. పద.''

సౌమ్య తలూపి లేచింది. ఆనాడే మొదలు.

3

''హాస్పిటల్లో గుమస్తాగా పనిచేస్తున్నావని తెలిసింది. నీతో పనిబడింది. ఫోన్ చేస్తే 'వూళ్లో లేదు. ఇవాళ ఆఫీస్‌కి రాలేదు' అని జవాబిచ్చారెవరో. ఫాక్స్ మెసేజ్ పంపితే, మీ ఆఫీస్‌లో ఫాక్స్ సౌకర్యమున్నా, తిరిగి మెసేజ్ రాలేదు. రిసీవ్ చేశామని గూడా తెలపలేదు. నిరాశపడక యంక్వయరీ చేస్తూనే వున్నా. జీవితభీమా సంస్థలో వున్నావని తెలిసింది. అక్కడనించీ వెళ్లిపోయావట. టెలిఫోన్ ఆపరేటర్‌గా వెళ్లింది. జీతం పెద్దది అన్నారు. అదీ ట్రై చేశా. ఫలించలేదు. గల్ఫ్‌దేశంలో టైపిస్ట్‌గా వెళ్లిందన్నారు. అక్కడికి నేను రాలేను గదా. నువ్వు వూడిపడాలి. దేవునికి మొక్కుకున్నా. యెలాగైతేనేం నిన్ను పట్టగలిగాను. నీకేమైనా పరకాయప్రవేశ విద్యవచ్చునేమోనని అనుమానం కలిగింది '' అన్నది పుష్పలత. కర్చీఫ్‌తో మొహమూ మెడా అద్దుకున్నది.

''ముందు కూచో పుష్పం. పోనీ నీవన్నది వచ్చునే అనుకుందాము. యేమిటి నాతో పని?'' అని డ్రింక్ తెప్పించింది సౌమ్య ఓపెన్ చేసి స్ట్రా వేసి బల్లమీదుంచింది.

పుష్ప సంతోషించింది. గొంతు తడారిపోయినట్టు ద్రాక్ష డ్రింక్ పీల్చసాగింది.

తన ముందున్న అఫిషల్ పేపర్స్ పక్కకునెట్టి, తానూ డ్రింక్ అందుకున్నది సౌమ్య.

''యేమనుకోకపోతే వున్న సంగతి చెప్పేస్తా'' అన్నది పుష్పలత. తలొంచుకుని కళ్లు పైకెత్తి నవ్వుతున్నది.

''యేమనుకోను చెప్పు. బహుశా పెళ్లి సంబంధమేమో'' ప్రోత్సాహమిస్తున్నట్టే అన్నది సౌమ్య.

''కరెక్టుగా వూహించావు. నా బంధువొకడు నిన్ను అక్కడా అక్కడా మీటవుతూ చూస్తూనే వున్నాడుట. యెదుటబడి అడగటానికి తగినంత సాహసం లేదుట. మొహమాటస్తుడు. నేను నీకు దూరపుబంధువునేగాక ఫ్రెండునని మాటల సందర్భంలో తెలిసింది. అక్కడనించి జిడ్డులాగా పట్టుకున్నాడు నన్ను. మధ్యవర్తిగావుండి, తన తరపున రాయబారం నడపమన్నాడు. నాక్కావల్సిన పన్లు చేసిపెడుతున్నాడు. అందుకని నిన్ను పట్టుకుని నీ అభిప్రాయం తెలుసుకుని వాడిక్కావల్సిన ఇన్‌ఫర్మేషన్ అందజేయాలని ట్రై చేస్తూ ఆయాసపడుతున్నాను'' అని గుటకవేసింది.

'' ఇంటరెస్టింగ్‌గా వున్నది పుష్పా! యేమి చేసి పెట్టాడు నీకు?''

'' ఒక టీ అరా కథలూ, ధారావాహికంగా ఒక నవలికా వార పత్రికల్లో వేయించి పెట్టాడు. మా మేనత్తకి మేజరాపరేషన్ అవసరమైతే, ఫ్రీడమ్ ఫైటర్ భార్యా అని అఫీషల్ పేపర్స్ ప్రొడ్యూస్ చేసి సగానికి సగం ఛార్జెస్ తగ్గించి ఆపరేషన్ సక్సెస్‌ఫుల్‌గా చేయించాడు. అవి పెద్దవి. చిన్నవీ వున్నాయి. అవి అంత పేర్కొనతగ్గవి కావు.''

''డాక్టరేమిటీ నీ బంధువు?''

''అవును. జనరల్ సర్జరీ పాసై విదేశం వెళ్లి కొన్నాళ్లుండి అక్కడ నచ్చక వచ్చేశాడు. ప్రైవేట్ సంస్థలో జాబ్ చేస్తున్నాడు'' అని డ్రింక్ సీసా అవతలుంచింది.

'' ఇన్ని చేసినా నచ్చిన స్త్రీ అందలేదూ?''

'' అందిందేమో. వదిలి వెళ్లిందేమో నేనడగలేదు. ప్రస్తుతం ఒంటరిజీవితం గడుపుతున్నాడు. ఇంటికి వచ్చేప్పటికి యింట్లో భార్యకనబడాలిట. నౌకర్లూ పనిమనిషీ కాదుట.''

''నా వయస్సు చెప్పలేదూ నువ్వూ? కంటాననే ఆశేలేదు. తనకున్నదేమో! ఆశాభంగం కలుగుతుంది.''

''చెప్పాను. ఫరవాలేదన్నాడు. పెంచాలనుంటే బంధువుల పిల్లలున్నారన్నాడు.''

''నువ్వు నన్ను గురించి వినలేదేమో పుష్పా! మనం కలుసుకుని పదేళ్లపైనే అయింది. పుష్కరకాలం గడిచిందేమో. ఈ లోపల చాలా జరిగింది. మా అమ్మ పోరు పడలేక, నస పెట్టేదామె, ''వయస్సు మీరిపోతున్నది. కాన్పులు కష్టమౌతై, అసలు చూస్తే సంతానం కలిగే వయస్సు మీరిపోయింది నీకు. కాని ఆశ చావదుగా. యేమో సంతానవంతురాలవౌతావేమో. నీ కడుపునో కాయకాస్తే చూసిపోతాను. సంపాదన చాలు'' అని వూదర పెట్టింది. సంబంధం మీద సంబంధం చూసింది. ప్రాణం విసిగి పెళ్లి చేసుకున్నా. మొగుడిపేరు త్రివిక్రమ్. వాడికి చాలా జబ్బులున్నాయి'' అని నవ్వింది సౌమ్య. ''కట్నం తీసుకోనన్నాడు అదో జబ్బు. బుద్ధిమంతునిలాగా అతి సహజంగా నటించాడు. మరొక వ్యాధి. అత్తగార్నీవచ్చి తనదగ్గరే వుండమన్నాడు. అన్నిటికన్నా పెద్ద జబ్బు, త్రివిక్రమునిలాగే, త్రివిక్రముడు కూడా భువనత్రయం గెల్చి తన అన్న ఇంద్రుని కిచ్చేశాడు. భువనత్రయంలో భూదేవి అనే స్త్రీ గూడా వున్నది, దాన్నీ అన్న కిచ్చేడన్నమాట'' మళ్లా నవ్వింది సౌమ్య. పుష్పనవ్వింది.

'' ఒకనాడా త్రివిక్రముడే నీటి అడుగున ఉన్న భూదేవిని చంద్రవంకలాంటి తనకోరలపై యెత్తి కాపాడి, కిరీటియై కౌగిట చేర్చెను. వాడేవీడు సుమా. సరీగ్గా యీ త్రివిక్రముడు గూడా తన సోదరునికన్నీ సరఫరా చేస్తూ చివరికి నన్నుగూడా, అదేదో వస్తువునిచ్చేసినట్టు యివ్వజూపాడు. మాయమాటలు చెప్పాడు. విన్నాను. మరో స్త్రీ బలంగా ఆకర్షిస్తున్నదని తెలిసింది. ఈ లోపల మా అమ్మపోయింది. యెవరికోసం వీడిని భరించాలీ అని

ఆలోచించి పరకాయప్రవేశం చేసి, సౌదీ అరేబియా పారిపోయినా. నేతాజీ చూడు సబ్‌మెరైన్‌లో పారిపోయి జర్మనీలో తేలాడు. అది పరకాయ ప్రవేశమే'' అని పకపక నవ్వింది సౌమ్య.

పుష్పనవ్వింది గానీ, ''వెతికి పట్టుకోలేదూ త్రివిక్రమ్?'' అని ఆశ్చర్యంగా అడిగింది.

''యెందుకూ దండగ. నేను విరగడకావాలనే త్రివిక్రముడు కోరుకున్నాడు.''

''మరో స్త్రీని తెచ్చుకున్నాడా?''

'' ఆ విషయం మనిద్దరికీ అనవసరం.''

''అదీ నిజమేలే సౌమ్యా! నాకూ అనుభవమే. కాని నేను విడాకులు పొందగలిగాననుకో. ఇంతకూ జవాబు చెప్పు'' అన్నది సంధి చేయదలచినట్లు.

''మీ బంధువే కావాలంటున్నాడు గనక తానే వచ్చి ఒప్పందం చేసుకోవాలి. తరవాత రోజులు గడుస్తుంటే నేనే కావాలని ప్రయత్నించినట్టు మాట్లాడితే ఒప్పుకోను. అది నిష్కారం మంచిది.''

4

రెస్టారెంట్‌లో ఇంటర్వ్యూ యేర్పాటు చేశాడు దయాసాగర్. టైమ్‌కి వచ్చింది సౌమ్య. టేబిల్ ముందు యెదురెదురుగా కూచున్నారు. వెయిటరొచ్చి మెను యిచ్చాడు. చూడమని సౌమ్యవైపు నెట్టాడు దయా. సౌమ్య నవ్వింది. ''మీరే ఆర్డరివ్వండి. యేమి యిష్టమో తెలుస్తుంది. నేను అతిథిని.'' అని అతనివేపు నెట్టింది.

''ముందు మీ ఆశయాలు, అభిప్రాయాలూ తెలుసుకుందాము'' అన్నాడు. తన విజిటింగ్ కార్డ్ సౌమ్య ముందుంచాడు. జేబుకి ఐడెంటిటీ కార్డ్ క్లిప్‌కి వేలాడుతున్నది. సుందరవదనారవిందం.

''నాకు పెద్ద ఆశయాలూ, అభిప్రాయాలూ లేవు. మీరు కావాలనుకున్నారు కనక మొదటి మెట్టు కోర్టింగ్. ఒకరికొకరం తెలిసిపోతాము.''

'' ఓకె. యెన్నాళ్లు కోర్టింగ్?'' అలా నవ్వుతూ అని ఆర్డరిచ్చాడు.

''రెండోది చెప్తా. మనకో శ్లోకమున్నది. కార్యేషు దాసీ కరణేషు మంత్రీ, క్షమయా ధరిత్రీ, భోజ్యేషు మాతా, శయనేషు రంభా'' అలా వుండటం నాకిష్టమే. చాతనౌను గూడాను. విడిపోరాదనే నా ఆశయం. కాని పరిస్థితులట్లా చేస్తాయి. చాలామంది జీవితాలు స్టడీ చేస్తే తెలుస్తుంది.''

మంచి సూప్ రుచి అయినది టొమెటో పండు రంగులో వున్నది. కప్పులతో తెచ్చి స్పూన్స్ వేసి యెదురుగా పెట్టాడు వెయిటర్. మిరియాల పొడి కనబడుతున్నది వేయించిన అప్పడాలూ, చల్లని మంచి నీరూ, యెదురుగా వాజులో పేపర్ కర్చిఫ్స్.

ఇద్దరూ చెరోటీ తీసుకుని సూప్ తాగసాగారు.

''కానీండి వింటున్నా'' అన్నాడు.

''ట్రబుల్ యెలా వస్తుందంటే, మొదట మీరొక్కరే వున్నట్టు భ్రమ కలుగుతుంది. గృహస్థ జీవితానికి అలవాటు పడుతుండగా, మీ వేపువారు రాకపోకలు సాగించగానే, వారికోసం ఖర్చుచేయగా మిగిలినది నా మొహాన్న పారేస్తున్నట్టు ఫీలౌతాను. ఆ వచ్చిపోయే వారు, వీళ్ల కలతలు లేకుండా సుఖంగా

వున్నారే అని జెలసీ కలిగి, నా గతం, మా అమ్మ జీవిత చరిత్ర తవ్వి హర్ట్ చేస్తూ అదేదో నాగరకతా సభ్యతా అనే భ్రమలోకి పోతారు. మీరు వాళ్లను రావద్దనలేరు. కంట్రోల్ చేయలేరు లెట్ ఎలోన్ డి జోన్ చేయటం. కుక్క తోక బట్టి గోదావరీదలేరు గదా.'' అని నవ్వుతున్నది. దయాసాగరూ నవ్వుతున్నాడు. ''మీకు మంచి హ్యూమరున్నది. నేను మెచ్చుతాను.'' అన్నాడు.

''మీకు నేనెంతగా పనికి వస్తున్నానో వాళ్లకూ అంతగా యూజ్‌ఫుల్‌గా వుండాలంటారు. మేమూ దాన్ని వాడుకోవాలని మీ వద్ద హక్కు ప్రకటిస్తారు.'' అన్నది. ''అదంతా నిజమే ననుకోండి. ఆపాలని ప్రయత్నిస్తా కాని వైద్యుడిని గదా. అందులోనూ సర్జన్ని. వృత్తి ధర్మం నెరవేర్చాలి. అలా ప్రమాణం చేయించే డిగ్రీ చేతికిస్తారు. ఇన్‌డీసెంట్‌గా వుండేవారిని భరించటం డాక్టరుకి అలవాటౌతుంది. దే కెన్ సఫర్ ఫూల్స్ గ్లాడ్లీ అన్నమాట'' అంటుండగా వేడి వేడి భోజనం ఘుమఘుమలాడుతూ వచ్చింది. స్వీట్ పలావ్, వెజిటబుల్ కట్లెట్, చారు, పప్పు, సాంబారు, కాబేజ్ కారెట్ బటానీల కూర, గోంగూర పచ్చడి, నెయ్యి, పెరుగు, వైట్ రైస్.

స్పూన్‌తో తినసాగారు. కాసేపు యింగ్లీష్‌లోనూ, కాసేపు తెలుగులోనూ, కాసేపు హిందీలో మాట్లాడుతున్నారు. సన్నని జంత్రీవాద్యం వింటూ భోజనం పూర్తి చేశారు. ఐస్‌క్రీమ్ కప్పులూ, గులాబ్ జామున్ ఒక్కొక్కటీ గాజు కప్పుల్లో స్పూన్‌తో తెచ్చి యెదురుగా పెట్టాడు వెయిటర్ అరిటిపండు. బీడా, వక్కపొడి, వేయించిన సోంపు పేట్లలో వున్నాయి.

చివరికి బిల్ వుంచిన పుస్తకం తెచ్చాడు.

దయాసాగర్ కర్చీప్‌తో పెదిమలద్దుకుని బిల్ చూసి డబ్బుంచి మూశాడు. వెయిటర్ చిల్లర తేగానే పుస్తకం కింది టిప్ పెట్టి, చిల్లర తీసుకుని జేబులో

వేసుకుని లేచాడు. సౌమ్యా లేచింది. బయటికి రాగానే, ''రుచి అయిన భోజనం పెట్టించినందుకు ధన్యవాదాలు'' అన్నది.

''అలా కాదు ధన్యవాదాలు చెప్పేది. నా అపార్ట్‌మెంట్‌కి రావాలి.'' అన్నాడు. చుట్టూ చెయ్యి మృదువుగా వేసి కారువేపు తీసికెళ్లాడు. మారుతీ డీలక్స్. తానే చక్రం పట్టాడు. నిశ్చయమైనట్టే చూస్తూ తీయగా నవ్వుతూ, కారు స్టార్ట్ చేశాడు.

5

చిన్న చిన్న ఆపరేషన్లు త్వరగా నమ్మకంగా చేయించుకుని త్వరగా వచ్చేయటానికి దయాసాగర్ బంధువులు, సరాసరి అతనింటికి వెళ్లేవారు. మూడు పడగ్గదులూ, మూడు స్నానాల గదులు సౌకర్యంగా వుండేది. వాళ్లు వచ్చి నోరూరేట్టు తమ అనుభవాలు చెప్పేవారు.

'' ఇప్పుడొకమ్మాయిని తెచ్చుకున్నాడు దయా. చాలా మంచి అమ్మాయి. జాబ్ చేస్తున్నది. కుక్కపిల్లే అనుకోండి. చాలా కలుపుగోలుతనం, తనవారే అనుకుంటుంది. యెంత ఛీప్ ప్రెజెంటిచ్చినా తీసుకుంటుంది. మర్యాదలు చెల్లిస్తుంది. ఒక్క పొల్లుమాట అనదు. వెలితి మాటలూ ఆడదు. వంటెంత బావుంటుందో!'' లొట్టలేసుకుంటూ చెప్పారు.

''వూరగాయలు పెడుతుంది. కొన్నవిగాదు. టిన్ ఫుడ్ కాదు. చాలా ఆధరువులు చేస్తుంది. తానే వడ్డన.''

దయాసాగర్ ఆత్మీయులకీ నోరూరింది. ఇప్పటి రోజులలో సాధారణంగా ఆడపిల్లలంతా పొగరుమోతులే. అత్తవారికీ పెద్దలకూ వెరిచే రోజులు పోయాయి. అసలు కాలమే మారిపోయింది. మునుపు కోడలు అత్తవారింటి కొచ్చేది. ఇప్పుడత్తవారే కోడలింటికెళ్లాలి. అదీ యిబ్బంది. మంచి తరుణం కోసం చూస్తున్నారు.

దేవుడనుకూలించి కాలం కలిసి వచ్చింది. హెర్నియా శస్త్ర చికిత్స. పిల్లలకి గొంతులో టాన్సిల్స్ తీయించాలి. కంట్లో సిస్ట్. లివర్లోనెప్పి. పళ్లు పీకించుకోవాలీ. పసికూనల్తో సహా ధైర్యంగా వెళ్లారు దయా యింటికి. పన్లు పూర్తిచేసుకున్నారు. బెట్టుగా వున్నారు. కాని వారికి సౌమ్య కుక్కపిల్లలాగే కనిపించింది. పిల్లలెటూ పారిపోకండా ఓ కన్ను వాళ్ల మీదుంచి నవ్వుతూ యింట్లోకి తెస్తుంది. పార్కుకు తీసికెళ్లి అందర్నీ గుర్తుపెట్టుకుని మళ్ళించుకొస్తుంది. ఇంటికి కావలి కాస్తుంది. హాస్పటల్‌కి భోజనం తీసికెళ్తుంది. యెవరు స్వంత మనుషులో యెవరు పరాయివారో పసికడుతుంది. యేదిచ్చినా సంతోషంగా దోసిలి పట్టి తీసుకుంటుంది. మిగిలిన భోజనం తినమన్నా తింటుంది. పెద్దలున్నప్పుడు నిలబడే వుంటుంది. యెదురుగా కుర్చీలో కూచోదు. సరసన కూచోదు. పాదాలు నాకుతున్నట్టే, తోకాడిస్తూ మొహం వంక చూస్తున్నట్టే తోచింది వారికి. తన కొయ్య యింట్లో పడుకుంటుంది.

అన్నీ యంత్రాలే. అన్నీ ప్యాకెట్సే. ఇన్‌స్టెంటు ఆహారం చేయచ్చు. దయాను మెప్పించాలని వంట చేశారు. సౌమ్యని పొగిడారు. ''నీ అదృష్టం సౌమ్యా, దయా అంత మంచి మొగుడు దొరకటం కష్టం.'' అన్నారు.

''మాతో తీసికెళ్లి సౌమ్యని నాల్రోజులుంచుకుంటాము నీవు వచ్చి తీసి కెళ్లచ్చు దయా!'' అని సూచించారు.

'' ఇక్కడ యిల్లు మానేజ్ చేసేవారేరీ?'' అని వారి కోర్కెను దాటవేశాడు దయా.

సౌమ్యనే పట్టుకున్నారు. ''మాతో రావాలి సౌమ్యా! మేమేం కొరుక్కు తింటామా నిన్నూ? మేమున్నది మహానగరం కాదనుకో. ఉన్నది యేడంతస్తుల భవనం కాదనుకో. మాకు మారుతీ కారు లేదనుకో. కూలర్ లేదనుకో,

దూరదర్శన్ లేదనుకో, అయినా మన వాళ్లని వస్తూ పోతూ వుండాలి. డాబాయే మాది. పూరికొంపనుకుంటున్నావేమో. సీలింగ్ ఫాన్ లేదుగానీ స్టాండున్న ఫానున్నది. ఫాక్సు లేదనుకో మాకూ ఫోన్ పెట్టారు. మీ ఆయన్ని పిలిచి మాటాడుకోవచ్చు'' అన్నారు ముఖప్రీతి కోసం.

''దయాసాగర్‌గారు వెంటరానిదీ రాలేను వదిన గారూ. ఆయనకు సెలవులేదు. ఆయనకు వీలు చిక్కగానే యిద్దరం వస్తాంలెండి. అది మా ఒప్పందం'' అన్నది సౌమ్య.

వారిక బాగా రావల్సిన అవసరం పడుతూనే వున్నది. మొదటలేని బాధ మొదలైంది. సౌమ్య లొంగిరావటం లేదని ఉక్రోషం మొదలైంది. మళ్లా వచ్చినప్పుడు,

''నువ్వు అదేదో ట్రెయినింగ్ సెంటర్లో తర్ఫీదైనావన్నారే మగవాళ్లను రంజింప జేయటం నేర్పుతారుట అక్కడ. నిజమేనా! ఆహా యెవరో అన్నారులే'' పిన్నత్త అడిగింది.

''మీ అమ్మ పూటకూళ్లమ్మ యిల్లు నడిపిందని చెప్పుకుంటారేం? అప్పుడెంత తీసుకునే వారూ పూటకీ?'' అనడిగింది పెద్దాడబడుచు అనే స్త్రీ.

''నువ్వు కాక యింకా నీలాటి వాళ్లున్నారని విన్నా. నీతోడబుట్టిన వాళ్లెక్కడున్నారూ?''

''విదేశాల్లో వున్నారు'' అని నవ్వుతూ అన్నది సౌమ్య.

''మీ నాన్నేం చేసేవాడు?''

''దండకారణ్యా హోటల్ ప్రొప్రయిటర్'' అన్నది

''యేం రోగంతో పోయాడూ కాన్సరేనా? మీ వంశంలో కాన్సరున్నదటగా!''

''కాన్సర్‌గాదు. అల్లర్లు లూటీలు జరుగుతుంటే, యజమానిని కాపాడి ఆయన డబ్బు కాపాడి తప్పించాడు. ఇంతలో దుండగులు రైఫిల్సుతో వచ్చారు. ఒకగుండు మా నాన్న గుండెల్లో దూసుకుపోయింది. పత్రికల్లో పడినాయి.''

''మీ బావ సినిమా హాల్లో గేట్ కీపర్‌గా పనిచేసేవాడు గదూ. ఆస్తంతా పేకాటలో కోల్పోయి ఆ పనిలో చేరాడు గదూ?''

''కాదు. మా బావ థియేటర్ రన్ చేసేవాడు. ఆ బిల్డింగ్ పాతదైంది. విదేశీయులొచ్చి మంచి ధర యిస్తాము. మేము వ్యాపారం పెట్టుకోవాలి. సెంటర్లో వున్నది. పదిరెట్లిస్తామంటే అమ్మేశాడు మా బావ. ఇప్పుడు ముంబాయిలో వున్నారంతా.''

''మీ పింతల్లి వైన్ షాపు నడుపుతన్నదటే. విదేశీ సరుకు తెప్పించి దాచి మంచి ధరకమ్మి మేడలేవదీసిందట.''

''వైన్‌షాపుగాదది. ఇంగ్లీష్ మందుల షాపు. మా పిన్ని ఫార్మసీ పాసైంది. మెడికల్ హాల్ పెట్టుకునేందుకు పర్మిషన్ తెచ్చుకున్నది. కొట్టు మీద బాబాయీ వుంటాడు పిల్లలూ వుంటారు.''

అలా అక్కసు కక్కుతుండగా అయిదేళ్లు గడిచినై. వస్తూనే వున్నారవసరానికి. సౌమ్యని తీసికెళ్తామనీ అడుగుతున్నారు. పన్నాగాలూ పన్నుతున్నారు.

క్రమంగా దయాసాగర్ మెత్తబడిపోవటం గమనించింది సౌమ్య. ఓసారి, ''వాళ్లంతా రమ్మని అడుగుతుంటే వెళ్లి రారాదూ?'' అని గూడా అన్నాడు.

ఇద్దరం వెళ్దాం రా అనలేదు. అందర్నీ చూసి వద్దాం రా అనలేదు. ఒక్కడే వెళ్లి వచ్చాడు. అదీ గమనించింది సౌమ్య.

మాటలు తగ్గించేసింది. వినయం విధేయతా చూపిందంతే. దాంతో అందరికీ సౌమ్య కుక్కపిల్ల లాగే కనబడింది. దయాలేనప్పుడు కుక్కపిల్ల నెత్తుకు పోవాలని చూశారు. దయాడబ్బుతో బొమికలు కొనిచ్చారు. మాంసంలో మత్తు కలిపారు. వాసన పట్టి వదిలేసింది.

దయా బెడ్ మీదుంటే కింద చాపమీద కూచుని చూస్తున్న సౌమ్య వెనకాళ్ల మీద కూచుని చూస్తున్న కుక్కపిల్ల లాగే కనబడింది.

ఒక దగ్గర బంధువుకి మేజర్ ఆపరేషన్ జరిగింది. విశ్రాంతి తీసుకోవటమూ ముగిసింది. ప్రయాణమైనారంతా.

''దయా! సౌమ్యని మాతో పంపించు చాలా సహాయపడుతూ సేవ చేసింది. విశ్రాంతిగా వుంటుంది. ఓ నెల మాదగ్గరుంచుకుని తెచ్చి దింపిపోతాము.'' అన్నారు.

''యేదీ?! సౌమ్య కనబడటంలేదే? నిన్నటినించీ పిలిచినా పలకటం లేదు'' అన్నది దయాతల్లి.

''దాని కొయ్య యింట్లో పడుకుంటున్నది నిన్నటినించీ. కుక్కకు దాలిగుంటే యిష్టం. వైభవం నచ్చుతుందీ? అందలంలో వుంచితే కుచ్చులన్నీ కొరుకుతుందిట'' అని పకపకా నవ్వింది సిస్టరిన్లా.

''తీసికెళ్లేట్టున్నారని జబ్బుగా వున్నట్టు నటిస్తూ యేమీ తినకుండా కంటబడకుండా తిరుగుతున్నది'' అన్నాడు యంగర్ బ్రదరిన్లా.

''నువ్వుపోయి పిలుచుకురా దయా! సాగదీయాలేమో! మరీ ముద్దుచేసి

నెత్తినెక్కించుకున్నావు'' అన్నది ఓల్డర్ సిస్టరిన్లా.

ఇలా అంతా తలోమాటా అంటూండగా, దయా ''సౌమ్య!'' అని పిలుస్తూ వెళ్లాడు. యెక్కడా లేదు. అందరూ వెతికారు.

''యేమై వుంటుందీ? పొద్దున కనబడింది. పరకాయ ప్రవేశం చేసిందేమో. ఆ విద్య వచ్చునన్నది నాతో.''

''అసలు మనిషి కాదేమో!'' అని సందేహం వెల్లడించాడు ఫాదరిన్లా.

ప్లేన్ టైమౌతున్నది. అందరూ హడావుడిగా కార్లలో దూరారు. సామాను డిక్కీల్లో కూరారు డ్రైవర్లు.

''రాను అనచ్చుగా. మాయం గావటమేమిటి?'' అంటుండగా కార్లు కదిలిపోయినై.

విమానాశ్రయం నించి యింటికొచ్చి యిల్లంతా గాలించాడు దయాసాగర్. దేనివెనకైనా దాక్కున్నదేమో. యెటునించైనా వస్తుందేమోనని చూశాడు.

తమ కోర్టింగ్ రోజులు గుర్తు వచ్చాయి. నిర్మల మొహం బుజానికానించి నవ్వేది సౌమ్య. కౌగిట్లో కరిగిపోయేది. నాజూకైన శరీరం తనను అల్లుకుపోయేది. అనుభూతి మిగిలింది. ఇంటికి రాగానే యెలా సేద దీర్చేదో, యెన్ని కబుర్లు చెప్పేదో గుర్తు వచ్చింది. కొత్త వంటకాలు చేసి వేడిగా వడ్డించి తినిపించేది.

బాగా అలసిపోయి బెడ్ మీద వాలాడు దయాసాగర్. బాగా అలవాటైన, ముద్దుల కుక్కపిల్ల, తెల్లని బొచ్చు కుక్కపిల్ల తప్పిపోతే యెదురుచూసినట్టు చూశాడు.

పేపర్లో మూడు భాషల్లో వేయించాడు.

''యెక్కడున్నా తిరిగిరా. నాహృదయ కవాటం తీసే వుంటుంది. యేదో ఒప్పందం చేసుకున్నాము. మరిచిపోయినాను. అదేం ఒప్పందం సౌమ్యా! పోనీ అది గుర్తు చేయటానికైనారా. మతిపోతున్నది నాకు.''